


చాలా సంవత్సరాలనాటి మాట!

ఆ రోజుల్లో విశాల నగరాన్ని రాజధానిగా చేసుకొని భాస్కర వర్మ అనే రాజుగారు పాలిస్తూ ఉండేవారు. ఆయన గొప్ప వీరుడు. కానీ, ఏ దేశం మీదా తనంతట తానుగా యుద్ధం చేసి ఎరుగడు. పంటలు బాగా పండటం వల్లా, గనుల్లో ఉన్న సంపదను వెలికి తీయడం వల్లా, ఆ రాజ్యం సుఖంగా ఉన్నది. ప్రజలందరూ సిరితోనూ, సంపదతోనూ చీకూ చింతా లేకుండా ఉన్నారు.

ఆ రాజ్యాన్ని గురించి వారూ వీరూ అనుకొంటున్న మాటలను మూషికరాజుగారు విన్నారు. ఈ మూషిక రాజ్యం అడవి మధ్యన ఉన్నది. మిగిలిన మూషిక రాజ్యాలకన్నా ఆ రాజుగారి రాజ్యం

బావుంది. అలాంటి మూషిక రాజుగారికి పళ్ళు పులిసేటంత భేషుగ్గా భాస్కరవర్మగారి రాజ్యం ఉందన్న మాట.

పగలంతా అక్కడక్కడా దాక్కుంటూ చీకటి పడగానే రాజో ద్యానవనంలో ప్రవేశించారు ఎలుకరాజుగారు. అక్కడి వింతలు విశేషాలు చూశారు. వెలుతురు తన మీద పడకుండా నానా అవస్థలతో ఎలుక రాజుగారు భాస్కరవర్మగారి పడకగది ప్రవేశించారు. వారి పడకను చూసి ఆశ్చర్యపోయారు. కావడానికి తనూ రాజే! ఐనా ఇంత సొగసైన పడక తనకు లేదు మరి!

ఆనందంతో ఎలుకరాజుగారు అటూ ఇటూ తిరుగుతుండగా బల్ల మీద గిన్నెలన్నీ పెద్ద చప్పుడుతో దొర్లాయి. ఆ ధ్వనికి వర్మగారు లేచారు. ఎదురుగా గజగజలాడిపోతున్న ఎలుక కనిపించింది. దాని భయం చూశాక వర్మగారికి నవ్వొచ్చింది. కాని వారు నవ్వలేదు. పక్కనే ఉన్న కత్తిని తీసుకొని దాని మీదికి విసర బోయారు. అప్పుడు మూషిక రాజుగారేమన్నారంటే—

"ప్రభూ! నేను మీలాంటి రాజునే! నా రాజ్యం అడవి మధ్యన ఉంది. మీ వైభవం చూదామని వచ్చాను. పొరపాటున మీకు నిద్రా భంగం కలిగింది. తప్పులను మన్నించడం రాజలక్షణం. ఇందుకు నేను మీకు ప్రత్యుపకారం చేస్తాను" భాస్కరవర్మ తమలో తాము నవ్వు కొన్నారు. సరేనంటూ తిరిగి పడుకొన్నారు.

ఇది జరిగిన రెండు మూడు వారాలకల్లా గొప్ప ఉపద్రవం జరిగింది. భాస్కరవర్మగారి మెతకదనం కనిపెట్టిన శత్రువులు, ఆ రాజ్యం మీదికి దండెత్తి వచ్చారు. సరిహద్దుల దగ్గర శత్రువులు యుద్ధానికి సన్నద్ధులవుతున్నారు. భాస్కరవర్మ సైనికుల్ని చాలా కాలంగా

యుద్ధమంటే ఎలా ఉంటుందో కూడా మరచి పోయారు. వారిని అసరా చేసుకొని శత్రువులతో యుద్ధం చేయడం కన్న మతిలేని పని మరొకటి ఉండదు.

భాస్కరవర్మకు ఏమి చేయాలో పాలుపోలేదు. ఆయన దిగులు పడి కూచున్న దశలో, వేగులవాళ్ళు వచ్చారు. సరిహద్దుల వద్ద గల సైనికులు చెల్లా చెదరయి పోతున్నారనీ, వారి నీటి పీపాలకు చిల్లులుపడి నీరంతా నేలపాలయిందనీ, ఆహారపదార్థాలన్నీ మటుమాయ మయ్యాయనీ పాద రక్షలు, దుస్తులు, వింటినారులు తుంపులు తుంపులయిపోయాయనీ గత్యంతరం లేకనే వారందరూ తిరుగు ముఖం పట్టారనీ వేగులు చెప్పారు.

ఇలా జరగడానికి కారణమేమిటో భాస్కరవర్మగారికి చప్పున తోచలేదు. కారణం తెలిశాక మూషికరాజు చేసిన సహాయానికి మురిసిపోయారు.